సాక్షి అనకాపల్లి

ఆదివారం ¦ 27 ¦ జూలై ¦ 2025



ఈ చిత్రంలో ఇరకు గదిలో చదువుతున్నది మండల కేంద్రం మాడుగుల బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు. ఇక్కడ 50 మంది ఉంటున్నారు. వీరికి పూర్తి స్థాయిలో వసతిసౌకర్యం లేదు. భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేదు. రాత్రి సమయంలో వీరు ఇరుకు గదిలో ఉన్న ఇనుప బెడ్‌ల మీద నిద్రిస్తున్నారు. ఈ ఇరుకు గదిలోనే వారి పెట్టెలు, పుస్తకాలు, బ్యాగులు పెట్టుకుని, చదువుకుంటున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది నర్సీపట్నం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహం. ఈ హాస్టల్‌లో సౌకర్యాలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పందించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో గత ఏడాది అక్టోబర్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ నియోజకవర్గంలోని పలు వసతి గృహాలను పరిశీలించారు. అప్పుడు నర్సీపట్నం ఎస్సీ బాలికల వసతి గృహంలో మరుగుదొడ్ల సౌకర్యం లేని విషయాన్ని గమనించారు. అప్పటికి ఒక్క మరుగుదొడ్డి మాత్రమే నిర్వహణలో ఉంది. ఇదే విషయం ఆయన ఉన్నత న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. అప్పట్లో ఈ విషయంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సీరియస్ కావడంతో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని మిగతా వసతిగృహాలతో పాటు ఇక్కడ వసతిగృహంలో సమస్యలపై తీసుకోబోయే



నర్సీపట్నంలో ఎస్సీ బాలికల వసతిగృహం

చర్యలు గురించి సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి స్వయంగా వివరణ ఇచ్చారు. అయితే ఇదొక్కటే కాకుండా జిల్లా వ్యాప్తంగా వసతి గృహాలను అధికార్లు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే చాలా సమస్యలు బయట పడతాయి. కనీస వసతులు లేక వసతి గృహాల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వస్తాయి.



సంక్షోభ హాస్టళ్లు

- సమస్యలకు నిలయాలుగా సంక్షేమ హాస్టళ్లు
- గురుకుల, కేజీబీవీ,మోడల్,బీసీ, ఎస్సీ,ఎస్టీ వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కరువు
- శిథిలమైన భవనంలో, పెచ్చులూడిన గదుల్లోనే వసతి గృహాల నిర్వహణ
- తలుపులు లేని బాత్ రూంలు,మరుగుదొడ్లతో ఇక్కట్లు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్



పై చిత్రంలో కనిపిస్తున్న బీసీబాలికల వసతి గృహం ఎస్.రాయవరం మండలం రేవు పోలంలోనిది. దీనిని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 57 మంది బాలికలు ఉన్నారు. కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఒకదాంట్లో వంట చేస్తున్నారు. రెండో గదిలోఅందరూ పడుకునేందుకు సరిపడా స్థలం లేదు. దీంతో రాత్రిపూట బాలికలు ఇళ్లకు వెళ్లిపోతున్నారు.



ఇవి విద్యార్థులు నిద్రపోయేందుకు ఉపయోగించవలసిన మంచాలు. సరైన వసతి లేక గొడిచర్ల బీసీ వసతి గృహానికి చెందిన ఈ మంచాలను అటకెక్కించేశారు. ఇక్కడున్న 64 మంది విద్యార్థులు నేల మీద నిద్రపోతున్నారు. ఫ్యాన్లు తిరగకపోవడంతో దోమలు కుడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు అవస్థలకు గురవుతూ నిద్రపోవలసి వస్తోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మాడుగుల పట్టణంలో ఎస్టీ జూనియర్, డిగ్రీ బాలికల వసతి గృహంలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్డి. ఈ హాస్టల్‌లో 100 మంది విద్యారినులుంటున్నారు. మూడు మరుగుదొడ్లు ఉండగా వాటిలో ఒకటి శిథిలమైపోయింది. మిగిలిన రెండు సరిపడక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



ఈ చిత్రంలో చాపలపై నిద్రపోతున్నది కోటవురట్ల ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు. ఈ వసతి గృహంలో 82 మంది విద్యార్థినులున్నారు. మంచాలు లేకపోవడంతో చాపలు, యోగా మేట్స్‌పై పడుకుంటున్నారు. ఈ ఏడాదికి సంబంధించి దుప్పట్లు అందజేయలేదు.దీంతో వణుకుతూ నిద్రపోవలసి వస్తోంది.

సాక్షి,అనకాపల్లి/నర్సీపట్నం/నక్కపల్లి/పాయకరావుపేట/మాడుగుల/మాడుగుల రూరల్/కోటవురట్ల/గొలుగొండ :

సాంఘిక సంక్షేమ ప్రీ, పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థులు	4,683 మంది
బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు	4,121 మంది
కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ హాస్టళ్ల విద్యార్థులు	3,146 మంది

శిథిలమైన భవనాలు..చాలీచాలని గదులు..తిరగని ఫ్యాన్‌లు..విరిగిన తలుపులు..పెచ్చులూడిన శ్లాబులు..పూర్తిస్థాయిలో మెయింటెనెన్స్‌లేని మరుగుదొడ్లు..తాగునీటికీ తప్పని ఇబ్బందులు..ఇలా ఒకటి కాదు రెండు కాదు జిల్లాలో గల హాస్టళ్లలో సమస్యల జాబితా ఏకంగా చాంతాడంత ఉంది. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. 'సాక్షి' నిర్వహించిన క్షేత్రస్థాయి విజిట్‌లో విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం, అశ్రద్ధ అడుగడుగునా స్పష్టంగా కనిపించింది.

జిల్లాలో మొత్తం 97 వసతి గృహాలున్నాయి. ఏ సంక్షేమ హాస్టల్‌ను చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్టు దర్శనమిస్తున్నాయి. అరకొర వసతి, గాడి తప్పిన నిర్వహణతో దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాత్రి వేళలో దోమల బెడద ఎక్కువగా ఉంది. దోమల తెరలు లేవు..కనీసం దుప్పట్లు సైతం సరఫరా చేయని దుస్థితి కనిపించింది. కొన్ని హాస్టళ్ల బాత్ రూంలు, మరుదుదొడ్లకు తలుపులు లేకపోవడంతో చిన్నారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మినరల్ ప్లాంట్లు మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు మోటార్‌నీళ్లే తాగుతున్నారు. మరుగుదొడ్ల పరిస్థితి మరీ ఘోరం ఉంది. రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

జిల్లాలో వసతి గృహాలు వివరాలు ఇలా..

ప్రీమెట్రిక్ బీసీ వెల్ఫేర్ వసతి గృహాలు 39	వీటిలో బాలురు 30	బాలికలు 9	బీసీ వెల్ఫేర్ కళాశాల వసతి గృహాలు 12	వీటిలో బాలురు 6	బాలికలు 6
ఎస్సీ వెల్ఫేర్ వసతి గృహాలు 32	వీటిలో ప్రీమెట్రిక్ హాస్టళ్లు 24	పోస్టు మెట్రిక్ 8	ఈ రెండింటిలో బాలురు 22	బాలికల వసతి గృహాలు 10	కేజీబీవీలు 14

నర్సీపట్నంలో..

నర్సీపట్నం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహంలో విద్యార్థినుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా వసతులు పెరగలేదు. దాదాపు ఐదు దశాబ్దాల క్రితం ఈ వసతి గృహాన్ని నిర్మించారు. 120 మంది విద్యార్థినులు ఉండేందుకు వీలుగా ఈ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం 228 మంది విద్యార్థినులు ఇక్కడ ఉంటున్నారు. వీరిలో ఉన్నత పాఠశాల విద్యార్థినులు 170 మంది కాగా, 58 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు. కాలేజీ విద్యార్థినుల వసతిగృహం ప్రత్యేకంగా నిర్వహించాల్సి ఉంది. సర్దుబాటు పేరుతో కాలేజీ విద్యార్థినులకు కూడా ఇక్కడే వసతి కల్పిస్తున్నారు. వసతి గృహంలో పది మరుగుదొడ్లు, పది స్నానాల గదులు ఉన్నాయి. పరిమితమైన వీటిలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. ఇటీవలే వీటిన్నింటికి మరమ్మతులు పూర్తి చేశారు. అయినప్పటికీ మూడు మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో వినియోగించడం లేదు. వసతిగృహం మొత్తం మీద నివాస గదులు ఏడు ఉన్నాయి. ఒక్కో గదిలో 10 నుంచి 15 మంది ఉండాల్సి ఉండగా 30 మంది వరకు ఉంటున్నారు.

- గొలుగొండ మండలంలో ఏపీ బాలయోగి గురుకుల కళాశాల వసతి గృహంలో డార్మెటరీ మరమ్మతులకు గురికావడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. మొత్తం 390 మంది విద్యార్థులున్నారు.

పాయకరావుపేట నియోజకవర్గంలో...

పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో గోడిచర్ల బీసీ హాస్టల్లో 64 మంది విద్యార్థులు ఉన్నారు. శిథిలావస్థకు చేరిన ఈ హాస్టల్ భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. నిర్మించిన 11 ఏళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయాయి. మంచాలు లేకపోవడంతో విద్యార్థులు కటిక నేల మీద పడుకోవలసి దుస్థితి ఉంది. గదుల్లో ఫ్యాన్‌లు సరిగ్గా తిరగడం లేదు. హాస్టల్ ఆవరణ అంతా అధ్వానంగా ఉంది. ప్రహరీ , తాగు నీటి సదుపాయం లేవు ప్రస్తుతం కోటవురట్ల హాస్టల్ వార్డెన్ ను 10 రోజుల క్రితం ఇంచార్జ్ గా నియమించారు.



రోలుగుంట బీసీ హాస్టల్ వద్ద నిల్వ ఉన్న మురుగు నీరు

- పాయకరావుపేటలో బీసీ బాయ్స్ కళాశాల హాస్టల్లో 71 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా నేల మీద పడుకుంటున్నారు. ఎస్సీ బాయ్స్ హాస్టల్లో 58 మంది విద్యార్థులున్నారు. వీరి పరిస్థితి కూడా ఇలాగే ఉంది.
- కోటవురట్ల మండలంలో గల సమగ్ర బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మంచాలు అందుబాటులో లేవు. నేలపైనే దుప్పట్లు వేసుకుని పడుకుంటున్నారు. టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయి. కిటికీల డోర్లు చెదపట్టి దారుణంగా ఉన్నాయి. బాత్ రూంలకు తలుపులు సరిగ్గా లేవు.

మాడుగుల నియోజకవర్గంలో

- మాడుగుల బీసీ జూనియర్ డిగ్రీ బాలికల వసతి గృహం అద్దె ఇంటిలో కొనసాగుతోంది.



కశింకోటలో నిరుపయోగంగా ఉన్న నాలుగు బాత్‌రూంలు

ఇక్కడ ఉంటున్న సుమారు 75 మంది విద్యార్థినులు ఇరుకు గదుల్లో ఇక్కట్లకుగురవుతూ సర్దుకోవలసి వస్తోంది.

- అద్దె ఇంటిలో నిర్వహిస్తున్న మాడుగుల జూనియర్, డిగ్రీ కళాశాల ఎస్టీ బాలికలు వసతి గృహంలో కనీస వసతులు లేవు. ఇక్కడ వందమంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు. కేవలం మూడు మరుదుదొడ్లు మాత్రమే ఉండగా వాటిలో ఒకటి శిథిలమైపోయింది. మిగిలిన రెండు మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేవు. మరుగుదొడ్లు సరిపడక ఇక్కడ విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు భోజనశాల వద్ద బురద మయంగా మారుతుండడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

మాడుగులలో బీసీ బాలుర వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయంగాభయంగా ఉంటున్నారు.ఇక్కడ 6 నుంచి 10 వ తరగతికి చెందిన 50 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. దుప్పట్లు, రగ్గులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

చోడవరం నియోజకవర్గంలో

చోడవరం: మండలంలో గాంధీగ్రామంలో ఎస్సీ బాలుర వసతిగృహానికి, చోడవరం ఎస్సీ గర్ల్స్ కాలేజీ హాస్టల్ భవనాలకు మరమ్మతు పనులు కొంతమేర చేశారు. గోవాడ బీసీ బాలుర హాస్టల్‌ను ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. తగిన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. చోడవరం ఎస్టీ కాలేజీ బాలికల హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులకు ఈ ఏడాది ఇంకా రగ్గులు సరఫరా చేయలేదు. వడ్డాది ఎస్సీ బాలుర హాస్టల్‌లో వాటర్ ఫిల్టర్, ఇన్వర్టర్ లేదు. దీనివల్ల కరెంటు లేని సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోలుగుంట బీసీ హాస్టల్ ఆవరణంలో మురికి నీరు నిల్వ ఉండి పోతోంది. భవనం కూడా పాతదికావడంతో కొద్దిపాటి వర్షానికే కొన్ని గదుల్లోని నీరు కారిపోతోంది.

- కశింకోటలోని వసతి గృహాల్లో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు మంచాలు లేక కటిక నేల మీద నిద్రించాల్సిన పరిస్థితిని ఉంది. వీరికి బెడ్ షీట్లు కూడా ఇవ్వడం లేదు. దీంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. పది మరుగుదొడ్లు వినియోగంలో ఉండగా మరో నాలుగు నిరూపయోగంగా ఉన్నాయి. బాత్‌రూమ్‌లు లేకపోవడంతో ఆరు బయట స్నానాలు చేస్తున్నారు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసినప్పటికి అవి చాలా కాలంగా పని చేయడం లేదు.

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

- కలెక్టర్ విజయ కృష్ణన్



చెత్త సేకరణ రిక్షాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం: ప్లాస్టిక్ వినియోగంతో ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయని, అందువల్ల ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించడానికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చెత్త సేకరణకు 40 మూడు చక్రాల రిక్షాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకమన్నారు. అందరూ వస్త్ర సంచులను వినియోగించాలని సూచించారు. తద్వారా సింగిల్ యూజ్ పాలిథిన్ కవర్ల వినియోగాన్ని నివారించవచ్చని తెలిపారు. కోహెన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ సౌజన్యంతో ఈ రిక్షాలను ఆయా గ్రామాలకు సమకూర్చారు.ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎం.జగన్నాథపురం వంటి కొండవాలు ప్రాంతాల్లో చెత్తసేకరణకు ఎలక్ట్రానిక్ ఆటోలు అవసరముంటుందన్నారు.

ఏడాదైనా రాని కొత్త పింఛన్లు





స్థాయీ సంఘం సమావేశంలో వేదికపై జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు,ఎంపీపీలు

- జెడ్పీటీసీ సభ్యుల ఆవేదన
- జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా వృద్ధులకు,దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్,ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరాపల్లి జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ కొత్త పింఛన్ల కోసం ఎంతో మంది అర్హులైన వృద్ధులు,దివ్యాంగులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా కొత్త పింఛన్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. దీని వల్ల ఎంతో మంది అర్హులైన అవ్వాతాతలు,దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వారికి ఇప్పటి వరకు ఎంతమందికి పింఛన్లు ఇచ్చారో తెలియజేయాలని కోరారు.కూటమి సర్కార్ అధికారం చేపట్టి ఏడాది అయినా ఇంకా కొత్త పింఛన్లు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు మాట్లాడుతూ తక్షణం పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, బీసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని దేవరాపల్లి జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం కోరారు.

అందుబాటులో ఉండని 108 వాహనాలు

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 108 వాహనాలు సక్రమంగా పనిచేయడం లేదని, రోగులకు అందుబాటులో ఉండడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ 108 వాహనాలు అందుబాటులో ఉండకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనిక్ సేవలు సక్రమంగా లేవని సభ్యురాలు సత్యవతి తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే రోడ్ల దుస్థితి

- చోడవరం రోడ్ల దుస్థితిపై కోర్టుకు నివేదించిన ప్రభుత్వ అధికారులు
- రోడ్డు కాంట్రాక్టర్, ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు నోటీసు జారీచేసేందుకు కోర్టు ఆదేశం
- వచ్చే నెల 23న మరోసారి హాజరుకావాలన్న 9వ ఏడీజే కోర్టు
- వివరాలు వెల్లండించిన పిటిషనర్ తరపు న్యాయవాది డేవిడ్



చోడవరంలో విలేకరులతో మాట్లాడుతున్న పిటీషనర్ తరపు న్యాయవాది కాంద్రేగుల డేవిడ్

చోడవరం : రోడ్లు బాగుచేయాలంటూ న్యాయవాదులు వేసిన పిటిషన్‌పై కోర్టు ముందు ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారులు శనివారం హాజరయ్యారు. సబ్బవరం నుంచి వయా చోడవరం, వడ్డాది, కొత్తకోట,రోలుగుంట మీదుగా మెయిన్ రోడ్డు (బీఎన్‌రోడ్డు), అనకాపల్లి–మాడుగుల ఆర్‌అండ్‌బీ రోడ్లు చాలా అధ్వానంగా గోతులు పడి ఉన్నాయని, వీటిని ఎందుకు బాగుచేయించలేదో తెలపాలంటూ ఈనెల 7వతేదీన చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టులో చోడవరానికి చెందిన న్యాయవాదులు అన్నాబత్తుల భరత్ భూషణ్, భూపతిరాజు పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై కలెక్టర్‌తోపాటు ఏడుగురు మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులకు కోర్టు నోటీసులు జారీ చేయగా, వారు శనివారం కోర్టు ముందు హాజరయ్యారు. కలెక్టర్ తరపున ఆర్‌అండ్‌బీ ఈఈ సాంబశివరావు, ఏఈ సత్యప్రసాద్ హాజరయ్యారు. ఈ పిటిషన్‌కు సంబంధించి వివరాలను పిటిషినర్ తరపున న్యాయవాది, చోడవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాంద్రేగుల డేవిడ్ విలేకరులకు వెల్లడించారు. ఈ రెండు రోడ్లు ఎందుకు బాగుచేయాలేదన్న విషయమై ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిబంధనలు ప్రకారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని డేవిడ్ చెప్పారు. ప్రజలకు కల్పించవలసిన ప్రాథమిక సదుపాయాలు సెక్షన్ 12ను అనుసరించి పిటిషన్ వేయడం జరిగిందన్నారు. చాలా యేళ్లుగా ఈ రోడ్లకు నిర్వహణ పనులు చేపట్టకపోడం వల్ల బాగా దెబ్బ తిన్నాయని, ప్రస్తుతం పెద్దపెద్ద గోతులు పూడ్చే పనులు చేపట్టామని అధికారులు కోర్టుకు వివరించారన్నారు. పూర్తిగా గోతులన్నీ పూడ్చడానికి చర్యలు చేపట్టామని వారు చెప్పినట్టు న్యాయవాది డేవిడ్ చెప్పారు. గోతులు పూడ్చడంతోపాటు పూర్తి స్థాయి రోడ్డును వేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టారని లీగల్ అథారిటీ వారు ప్రశ్నించారన్నారు. రోడ్డు కాంట్రాక్టర్ ఎ.అశ్వంత్ అనే వ్యక్తి నిర్లక్ష్యం వల్లే రోడ్లు సకాలంలో వేయలేకపోయామని అధికారులు తెలిపారని న్యాయవాది చెప్పారు. ఈ కాంట్రాక్టర్‌తో పనిచేయించే అధికారం తమకు లేదని, ఎన్‌డీబీ ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్‌కు మాత్రమే అధికారం ఉంటుందని జిల్లా అధికారులు చెప్పడంతో సదరు కాంట్రాక్టర్, చీఫ్ ఇంజినీర్ (విజయవాడ) వ్యక్తిగతంగా ఆగస్టు 23వతేదీన కోర్టుకు హాజరుకావాలని అథారిటీ చైర్మన్ అదేశించారని న్యాయవాది చెప్పారు. వీరికి నోటీసులు వెంటనే పంపాలని సిబ్బందిని కోర్టు ఆదేశించిదన్నారు. వీరి సమాధానాన్ని బట్టి రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అవసరమైతే హైకోర్టుకు కూడా వెళతామని పిటీషనర్ తరపు న్యాయవాది డేవిడ్ చెప్పారు.

క్షణికావేశంతో జీవితం జైలుపాలు

అనకాపల్లి :

క్షణికావేశంలో చేసిన తప్పుల కారణంగా కొంతమంది వ్యక్తులు జైలు శిక్ష అనుభవిస్తారని అడిషనల్ సివిల్ (సీనియర్ డివిజన్) న్యాయమూర్తి జి.రామకృష్ణ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు సబ్ జైలును జిల్లా పదో అదనపు న్యాయమూర్తి వి.నరేష్ ఆదేశాలు మేరకు శనివారం సబ్ జైలును పరిశీలించారు.

శిక్ష అనుభవిస్తున్న ఖైదీల పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణ

అలనాటి వివాహ వైభవం

8లో

పెళ్లి అనేది ఒక మధుర జ్ఞాపకం.. దాని కోసం నేటి యువత తమ అభిరుచి, ఆలోచనలకు తగ్గట్టుగా వేడుక జరిపించుకుంటోంది.



క్లుప్తంగా

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నమెంట్‌కు విరాళం



కలెక్టర్ షణ్మోహన్‌కు చెక్ అందజేస్తున్న విజయ ప్రకాష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆగస్టులో నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, **హాకీ జాతీయ** జూనియర్ మహిళా టోర్నమెంట్‌కు **శ్రీప్రకాష్** విద్యా సంస్థలు రూ.2 లక్షల **విరాళం అందించాయి.** జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు **ఆయన** చాంబర్‌లో శ్రీప్రకాష్ విద్యా సంస్థల **డైరెక్టర్** సీహెచ్ విజయ ప్రకాష్ శనివారం **చెక్ అందజేశారు.** శ్రీప్రకాష్ యాజమాన్యాన్ని **కలెక్టర్** అభినందించారు. ఇటువంటి **కార్యక్రమాలకు** సహకారం అందించడం సంతోషం**గా ఉందని** కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణతో దళితల ఐక్యతపై కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

నర్సీపట్నం: దళితల ఐక్యతను దెబ్బతీసేందుకే ఎస్సీ వర్గీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చినట్టు నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్. రత్నాకర్ ఆరోపించారు. ఆయన శనివారం నర్సీపట్నంలో మాట్లాడారు. దేశంలో ఎస్సీలో 1108 కులాలుండగా వాటి మధ్య చిచ్చురేపేందుకు ఎస్సీ వర్గీకరణ చేయడం కోసం మోదీ, చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా మాలలు అంతా ఐక్యంగా పోరాటాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రేమ్‌బాబు, కుంద్రు కల్యాణ్, నెల్లి సూరిబాబు,నాని పాల్గొన్నారు.



బండినెక బండికట్టి.. పీడీ పాలెంకు వరుసగా వస్తున్న ఎద్దుల బళ్లు

అలనాటి వివాహ వైభవం

- ఎద్దుల బండిపై ఊరేగిన పెళ్లికూతురు
- పూర్వకాల పద్ధతిని చూసి మురిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



ఎడ్లబండిపై ఊరేగుతున్న పెళ్లి కుమార్తెతో అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట: పెళ్లి అనేది ఒక మధుర జ్ఞాపకం.. దాని కోసం నేటి యువత తమ అభిరుచి ఆలోచనలకు తగ్గట్టుగా వేడుక చేసుకుంటోంది. **చెన్నైలో** ఓ జంట సాగరం గర్భంలో వివాహం చేసుకోగా, పంజాబ్‌లో మరో జంట పంట పొలాల్లో పెళ్లి వేడుక చేసుకుంది. ఇక శుభలేఖల నుంచి ఇతర సారె, సరంజామా వరకు వినూత్న పద్ధతులతో ఆకట్టుకుంటున్నారు. **ఇదే కోవలో బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెంలో శనివారం జరిగిన పెళ్లి వేడుక అలనాటి వివాహ వైభవాన్ని తలపించింది. హైటెక్ యుగంలో ఖరీదైన కార్లలో ఊరేగుతున్న వధువులకు** భిన్నంగా **ఓ వధువు** ఎడ్లబండిపై వరుడి ఇంటికి వచ్చి ఆశ్చర్య పరిచింది. రవాణా సదుపాయాల్లేని పూర్వ రోజుల్లో ఎడ్లబళ్లు, గుర్రపు జట్కాలపై పెళ్లికుమార్తెతోపాటు సారెను పెళ్లింటికి సాగనంపేవారు. అదే పద్ధతితో పెళ్లి కుమార్తె లావణ్యను పది ఎడ్లబళ్లతో పలు గ్రామాల మీదుగా ఊరేగింపుగా తీసుకొచ్చారు. **అ**నంతరం వరుడితో ప్రత్యేకంగా అలంకరించిన **పల్ల**కిలో ఊరేగింపు చేశారు. పొట్టిదొరపాలేనికి చెం**దిన** కోఆపరేటివ్ సెక్రటరీ దరిమిశెట్టి మహాదే**ముడు** కుమారుడు మోహనకృష్ణ రవితేజనా**యడు**కు రావికమతం మండలం మరుపాక మాజీ **సర్పంచ్**, వైఎస్సార్‌సీపీ నాయకుడు పండూరి సత్తి**బాబు** కుమార్తె లావణ్యకు జరిపించిన ఈ వివాహ **వేడుక** పలువురిని ఆకట్టుకుంది. పెళ్లికుమార్తె **లావణ్య** ప్రస్తుత గ్రామ సర్పంచ్ కాగా, ఇటీవల **బీఏ ఎల్‌**ఎల్‌బీ పూర్తి చేయడం గమనార్హం. ఈ వేడుకలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని పూర్వకాలం వివాహ వేడుకను ఈతరం యువతకు చూపించావు అంటూ పెళ్లి కుమార్తెను అభినందించారు. వధూవరులిద్దరిని బుచ్చెయ్యపేట, రావికమతం మండల నాయకులతో కలిసి ఆశీర్వదించారు.

రానున్న 15 రోజులు వరినాట్లకు కీలకం



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్‌లో మే, జూన్ నెలల్లో ఆశించని వర్షాలు కురిసినప్పటికీ వరినాట్లు పూర్తి చేసేందుకు రాబోయే పక్షం రోజులు కీలకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన టి అండ్ వి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. మే, జూన్ నెలల్లో జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షాలు పడ్డాయన్నారు. జులైలో సాధారణ వర్షపాతంలో సగం నమోదైన కారణంగా వరినాట్లు వేసుకోవడానికి వాతావరణం అనుకూలంగా లేదని పేర్కొన్నారు. రానున్న 15 రోజుల్లో ఆశించిన వర్షాలు కురిస్తే రైతులు వరినాట్లు వేసుకునేందుకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రతినిధి శ్రీధర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వి.రమణమూర్తి, ఆదిలక్ష్మి, విశాలాక్షి, డి.ఉమామహేశ్వరరావు, సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ పంద్రాగస్టు వేడుకలకు సర్పంచ్ ప్రశాంతికి ఆహ్వానం



ఎస్.రాయవరం: ఢిల్లీలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు ఆహ్వానం అందుకున్న పెట్టుగోళ్లపల్లి సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దినందుకు ప్రభుత్వం నుంచి గుర్తింపు వచ్చిందని సర్పంచ్ వెంకట ప్రశాంతి తెలిపారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో ఐదు దశాబ్దాలుగా అల్లువారి కుటుంబం నుంచి సర్పంచ్‌లుగా సేవలందించి గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర వహించారు. 2021లో తాను సర్పంచ్‌గా ఎన్నికై అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారంతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్టు అల్లు ప్రశాంతి తెలిపారు. గ్రామంలో ప్రకృతి వ్యసాయంలో శిక్షణ ఇవ్వడంతో సుమారు 70 ఎకరాల్లో సాగు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు రూ.23 లక్షలతో, ప్రస్తుత ప్రభుత్వంలో ఎస్ఎస్ఏ నుంచి రూ.15 లక్షలతో ప్రహరీ, ఎస్‌డీఎఫ్ గ్రాంటు రూ.3 లక్షలతో ఆడిటోరియం వంటి నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ఢిల్లీ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషకరంగా ఉందని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు.

బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి



జీవీఎంసీ విలీనగ్రామమైన కొత్తూరు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి: ఉపాధ్యాయులు బదిలీలు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా జూన్, జూలై నెలల జీతాలు నేటికీ ప్రభుత్వం చెల్లించలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ విలీనగ్రామమైన కొత్తూరు డీఈవో కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడానికి కావలసిన ఏర్పాట్లు చేయకపోవడం దారుణమన్నారు. జిల్లాలో సుమారు ఎనిమిది వందల మంది ఉపాధ్యాయులు జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. పొజిషన్ ఐడీలు కోసం ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడు సంతకం చేయాలని, సంతకం ఎప్పుడవుతుందో తెలియదన్నారు. జూన్ నెలలో బదిలీలు పొందిన ఉపాధ్యాయుల జాబితాను విద్యాశాఖ అధికారులు జనవరి నెలలోనే సిద్ధం చేసినప్పటికీ, వారి జీతాల కోసం ఏర్పాట్లు చేయక పోవడం ఉన్నతాధికారుల నిర్లక్ష్యమేఅన్నారు. జిల్లా సహాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కంటే కూటమి ప్రభుత్వ హయాంలోనే ఉపాధ్యాయులు ఎక్కువ సమయాన్ని బోధనేతర పనులకు కేటాయించవలసి వస్తుందని విమర్శించారు. ఉపాధ్యాయులకు చదువు చెప్పే కార్యక్రమం తప్ప ఏ బోధనతర కార్యక్రమాలు అప్పాజెప్పకూడదని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు గుత్తుల సూర్యప్రకాష్, శేషు కుమార్, రమేష్ రావు, సీనియర్ నాయకులు జీ.కె. ఆర్ స్వామి, అలమేలు , ఎల్లయ్య బాబు, ఉప్పాడ రాము, మామిడి బాబురావు, రవి, ఆశ, నూతన్, శివశ్రీ, సత్యవేణి, ఈశ్వర్, జగన్, దినకర్, అర్జున్, పీటర్ పాల్, వెంకట్, గణేష్ చంద్ర తదితరుల పాల్గొన్నారు.

‘అమ్మ పేరిట ఒక మొక్క’తో మానవ సంబంధాలు వృద్ధి



మొక్కలను నాటుతున్న కాగ్ సీనియర్ ఆడిటర్ కె.ఎస్.రాజు

అనకాపల్లి: మానవ సంబంధాల పెంపుదలకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో మొక్కలు నాటాలని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కె.ఎస్‌రాజు అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం ‘ఏక్ పేడ్ మా కే నామ్’ (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమం క్యాంపెయిన్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. తల్లి పేరు మీద ఒక మొక్కను నాటడానికి ప్రోత్సహించాలని, ఈ కార్యక్రమం తల్లులు అందించే సంరక్షణ, వృద్ధికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. జీవవైవిధ్యానికి దోహదపడే మొక్కలను మాత్రమే నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలకు మాతృభక్తి, పర్యావరణం పట్ల ప్రేమ కలుగుతుందని ఆయన చెప్పారు. ‘అమ్మ పేరిట ఒక మొక్క’ అనేది ప్రేమ, బాధ్యత, భవిష్యత్ పట్ల కృతజ్ఞతను వ్యక్తపరచే మార్గమవుతుందన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డెరైక్టర్ గొర్లి మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కుసుమావతి, అధ్యాపకులు కె.వి.ఎస్.ప్రభాకర్, వై.ఎల్.అక్షయ, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత రైతుల నిరాహార దీక్ష

- ఆర్డీవో కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం



నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద వంటావార్పు చేస్తున్న రైతులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరులోని సర్వే నంబర్ 332లో క్వారీని వెంటనే మూసి చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా బహుజన పార్టీ రాష్ట్ర నాయకుడు బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం 4వ రోజు నిరాహార దీక్ష కార్యక్రమం కొనసాగింది.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నాలుగు రోజులు నుంచి దళితలు నిరాహార దీక్షలు చేస్తున్నా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు.మైనింగ్ మాఫీయా కారణంగా దళిత రైతులకు జీవనాధారమైన భూముల్లో దుమ్మధూళి రావడం వల్ల పంటలు నాశనం అవుతున్నట్లు ఆరోపించారు. ఇప్పటికే అనేకమార్లు అధికారులు దృష్టికి తీసుకువచ్చినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈవిషయంలో అధికారులు స్పందన చూసి సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఉద్యమం చేయనున్నట్టు చెప్పారు. దీక్షా శిబిరం వద్ద శనివారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిరంజీవి,మల్లేస్,అప్పారావు, లోవరాజు , పెంటయ్య, సతీష్ తదితర్లు పాల్గొన్నారు.

నర్సులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసీఏపీ, టీఎస్ఏఐ ఆధ్వర్యంలో నర్సులకు ఉచితంగా ఆన్‌లైన్లో జర్మన్ భాష నేర్పించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ నర్స్ (బీ2 సర్టిఫికెట్), ఎ1 నుంచి బీ2 వరకూ భాషా శిక్షణ స్థాయిలో ప్రావీణ్యం ఉండాలి. జీఎన్ఎం లేదా అంతకంటే పైగా విద్యార్హత కలిగి కనీసం ఏడాది అనుభవం ఉండాలన్నారు. గరిష్టంగా 39 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. నెలకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలు ఆదాయం వస్తుందన్నారు. వచ్చే నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలం 7 నుంచి 8 నెలలు మాత్రమేనని, ఆన్‌లైన్ తరగతులు రోజూ ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ, సాయంత్రం 5.45 నుంచి 8.45 గంటల వరకూ ఉచితంగా ఇస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులు జర్మనీలో మూడు సంవత్సరాలు ఒప్పందంతో విధులు నిర్వహించాలని సూచించారు. మరిన్ని వివరాలకు టజుజీnter nationa@aprrdc.in తేదీ 9988853335, 8712655686, 8790118349 సంప్రదించాలన్నారు.

నలుగురు గంజాయి నిందితుల అరెస్టు

అనకాపల్లి టౌన్: గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అనకాపల్లి పట్టణం గవరపాలేనికి చెందిన మామిడి ఎల్లాజీ, కశింకోట మండలం చిన్నయ్యపేటకు చెందిన వడ్డాది వినయ్, యలయంచిలి మండలం తులసినగర్‌కు చెందిన దాడి రాము, అదే మండలం పేరటాలపాలెం గ్రామానికి చెందిన ఆడిబోయిన మనోహర్ కలిసి ఈ నెల 26 మధ్యాహ్నం పూల్‌బాగ్ జంక్షన్‌లో వాటర్ ట్యాంక్ వద్ద గంజాయిని ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ డి. ఈశ్వరరావు తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.27 వేల విలువ చేసే ఐదున్నర కేజీల గంజాయిని, ఒక మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను రాబడుతున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ కోసం కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

పదోన్నతి అంటే మరింత బాధ్యత

- ఎస్పీ తుహిన్ సిన్హా



ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: పోలీస్ శాఖలో పదోన్నతి అనేది గౌరవం మాత్రమే కాదని, మరింత బాధ్యత పెరిగినట్టు అని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పని చేస్తున్న 1990 బ్యాచ్ హెడ్ కానిస్టేబుళ్లు 25 మంది ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. స్థానిక సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు వారి కార్యాలయంలో శుక్రవారం వీరితో ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐగా పదోన్నతి కల్పించడం జిల్లా పోలీసు శాఖ గర్వపడుతుందన్నారు. వీరిలో 16 మందిని అనకాపల్లి జిల్లా పోలీస్ యూనిట్‌కు, 9 మందిని అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించామన్నారు. కొత్త హోదాలో మరింత నిబద్ధతతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పనితీరును నిరంతరం మెరుగుపరుచుకుంటూ పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బీమా భాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన క్వారీ లారీ



ప్రమాదానికి కారణమైన లారీ

అనకాపల్లి టౌన్: పట్టణంలో పోలీసుల సాక్షిగా త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే నాలుగు రోడ్ల జంక్షన్‌కు మెయిన్ రోడ్డు మీదుగా చేరుకున్న క్వారీ లారీ మహిళను ఢీ కొంది. ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు తిరిగే క్రమంలో ఆమెను ఢీకొట్టి 50 మీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. వెంటనే స్థానికులు పెద్దగా కేకలు వేసి లారీ డ్రైవర్‌కు సైగ చేయగా ఆపాడు. ఈలోగా అక్కడే ఉన్న పట్టణ సీఐ విజయ్‌కుమార్ స్పందించి మహిళా కానిస్టేబుళ్ల సహాయంతో ఎన్టీఆర్ ఆస్పత్రికి క్షతగాత్రురాలిని తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. వాస్తవానికి ఈ ప్రమాదం జరిగిన కొద్ది సేపటికి ముందు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ జరిగింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. అందువల్ల నెమ్మదిగా క్వారీ లారీ వెళ్లిందని, లేకపోతే స్పీడుగా వెళ్తే ప్రాణాలు పోయేవని పలువురు వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా వేళ కాని వేళలో మెయిన్ రోడ్డు మీదుగా క్వారీ లారీ ఎలా వచ్చిందని, ఇది ఎవరిదని వదిలేశారంటూ బాహాటంగా ప్రశ్నిస్తున్నారు. అయితే దీనిపై ఫిర్యాదు చేయకుండా బాధితురాలితో రాజీకి చేసుకున్నట్టు సమాచారం.

పేకాట రాయుళ్ల అరెస్టు

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలో పేకాడుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. తోటాడలో పేకాడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.5800 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు వింటున్న మండల ప్రత్యేక అధికారి సుభాషిణి

కశింకోట: భూ సమస్యల పరిష్కారంపై చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి ఉగ్గినపాలెం, జమాదులపాలెం ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ తిరుమలరావు, ఏఎస్ఐ రమణమ్మ, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పూజా సామగ్రి బుట్టల వితరణ

అనకాపల్లి టౌన్: మండలంలోని సత్యనారాయణపురం కనకదుర్గ కొండపై అమ్మవారి ఆలయానికి పూజా సామగ్రి బుట్టలను విరాళంగా అందజేశారు. దసరా పండగలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని దాత ఆడారి కుమారిస్వామి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ బోయిన రమణాజీ, కోటిపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్గినపాలెంలో పరిసరాల పరిశుభ్రత



ఉగ్గినపాలెంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో శనివారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు మురుగు కాలువలు, రోడ్లపై చెత్తను తీసి శుభ్రం చేశారు. రోడ్ల పక్కన, కాలువల్లో పేరుకుపోయిన గడ్డిని తొలగించారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి శనివారం సందర్భంగా స్వామిని పూలు, తులసి మాలలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించారు. మండలంలోని నరసింగబిల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: ద ఫెంటాస్టిక్
సత్యనారాయణ స్క్రీన్-1	:జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	హరి హర వీరమల్లు
పర్తిసాయి	: మహావతార్ నరసింహ
షిర్డీసాయి	: హరి హర వీరమల్లు
వెంకటేశ్వర	: హరి హర వీరమల్లు
శ్రీ సత్య	:తమ్ముడు
రామచంద్ర	: హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12, బీ పాజిటివ్-8, ఓ పాజిటివ్-20, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 337 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వాహనమిత్ర ఊసేలేదు

- మోసపూరిత హామీలతో ఆటోవాలాలను వంచించిన కూటమి ప్రభుత్వం
- ఏడాదైనా అమలు కాని పథకం
- మూడున్నర వేల ఫైదిలుకు ఆటోడ్రైవర్ల ఎదురుచూపులు

అనకాపల్లి: అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు ఏడాది దాటినా హామీలు అమలు చేయడంలేదు. హామీలు అటకెక్కించడంలో సీఎం చంద్రబాబును మించిన వారు లేరని ప్రజలు చర్చించుకుంటున్నారు. అన్ని వర్గాల ప్రజల మాదిరిగానే తాము కూడా మోసపోయామని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పిస్తామని కూటమి మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా వాహనమిత్రపై చంద్రబాబు నోరు మెదపడం లేదు. అనకాపల్లి పట్టణానికి గ్రామీణ ప్రాంతాలైన చోడవరం, రావికమతం, బుచ్చియ్యపేట, కశింకోట, మునగపాక, అచ్యుతాపురం, పరవాడ, మాడుగుల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 3 వేల ఆటోలు నిత్యం తిరుగుతుంటాయి. పట్టణ పరిధిలో సుమారు మరో 600 ఆటోలు ఉన్నాయి. పట్టణంలో 36 ఆటో స్టాండ్లు ఉన్నాయి. ట్యాక్సీలు 200, లారీలు సుమారు 2 వేల వరకు ఉంటాయి. బస్సులు వెళ్లని చాలా మార్గాల్లో ప్రయాణికులు ఆటోలపై ఆధారపడి గమ్యస్థానాలకు చేరుకుంటారు. గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రతి ఏడాది బడ్జెట్‌లో కొంత నిధి కేటాయించేది. అర్హులైన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు వారి ఖాతాలో జమ చేసేది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల జీవిత బీమా అందించేది. వాహనం కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించేది. వాహనమిత్ర నగదు ఎఫ్‌సీలు, వాహనాలు పాడైతే రిపేరు ఖర్చులు, ఇతర వాటికి ఎంతగానో ఉపయోగపడేది.





నెహ్రూచౌక్ స్టాండ్‌లో ఆటోలు

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు..

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఆటో కార్మికులు రోజంతా కష్టపడితే రూ.300 నుంచి రూ. 400 వరకూ వస్తాయి. రెండు సంవత్సరాలకు ఫిట్‌నెస్ కోసం రూ. 15 వేల వరకూ ఖర్చు అవుతుంది. అలాగే తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు దాడులు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలను నెలవారి వాయిదాలు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంగా మారిపోతున్నాయి.

కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్నాం..



రెక్కాడితే గానీ డొక్కాడని జీవితం మాది. కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్నాం. రోజురోజుకు పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ప్రయాణికులు ఛార్జీలు పెంచితే ఒప్పుకోవడం లేదు. ఆటోల ఫైనాన్స్ పెరిగిపోయింది. కేసులు ఎక్కువగా రాస్తున్నారు. అలవాటు పడిన వృత్తి కాబట్టి మానలేకపోతున్నాం.

– కోరిబిల్లి జగదీష్, నెహ్రూచౌక్ ఆటోస్టాండ్ అధ్యక్షుడు, అనకాపల్లి

వాహనమిత్ర ఇస్తారన్న నమ్మకం లేదు..



వైఎస్సార్‌సీపీ పాలనలో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు ఇస్తే, ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. ఏడాది పూర్తి అయినా నేటికి ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లంతా మోసపోయాం. ఈ ఏడాదైనా రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తుందో లేదో తెలియదు.

– బి.శ్రీనివాసరావు, అక్కిరెడ్డిపాలెం, అనకాపల్లి మండలం

ఖర్చులు పెరిగిపోతున్నాయి..



అనకాపల్లి–గాజువాక దారిలో తిరుగుతున్నాం. ఈ దారిలో అనకాపల్లి నుంచి లంకెలపాలెం వరకు మాత్రమే ప్రయాణికులు ఎక్కుతారు. ఆటోకు రూ.20 కాగా ఆర్టీసీ బస్‌కు రూ. 25 నుంచి రూ. 30 వసూలు చేస్తున్నారు. పదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఆటో నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయి.

– ఎస్.దేవరాజు, అనకాపల్లి

వెంగమాంబ క్వారీలో అక్రమ మైనింగ్



వెంగమాంబ క్వారీని పరిశీలిస్తున్న సీపీఐ నేత వియ్యపు రాజు

అనకాపల్లి: మండలంలో సహజ సంపదైన క్వారీలను కూటమి ప్రభుత్వం దోచుకుని కోట్లాది రూపాయలు ఆర్జిస్తోందని, మైనింగ్ అధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర విడనాడాలని సీపీఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు అన్నారు. సీతానగరం రెవెన్యూ పరిధిలోని వెంగమాంబ క్వారీని శనివారం ఆయన పరిశీలించారు. ఈ క్వారీ క్రషర్ల లీజు ముగిసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా కూటమి నేతలు దీనిని నడుపుతున్నారన్నారు. క్వారీల కారణంగా తాగునీరు లేక, పీల్చడానికి పరిశుభ్రమైన గాలి లేక గ్రామీణ ప్రజలు మృత్యువార్త పడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ప్రభుత్వ అధికారులు, మైనింగ్ అధికారులందరూ కలిసి వెంగమాంబ క్వారీ యాజమాన్యం శ్రీనివాస్ చౌదరికే కొమ్ము కాస్తుంటే ఎవరికీ చెప్పుకోవాలో తెలియక.. దిక్కుతోచని స్థితిలో ఆ గ్రామాల ప్రజలు ఉన్నారన్నారు. ఈ క్వారీని తక్షణమే నిలిపేయాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తును ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వియ్యపు రాజు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలని డిమాండ్

అనకాపల్లి టౌన్: లంకెలపాలెం జంక్షన్‌లో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కొడిగంటి గోవిందరావు భవన్‌లో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు వై.ఎస్.భద్రం మాట్లాడుతూ వరుసగా లంకెలపాలెం కూడలిలో ప్రమాదాలు జరుగుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదాల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టుమూరి నూక అప్పారావు, సీపీఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు, కొల్లి చిన్న అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి: ఏపీటీఎఫ్ అనకాపల్లి మండల అధ్యక్షుడిగా కె.వి.ఎల్.గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నరసింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో శనివారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.కిరీటీతోపాటు మరి కొంతమందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరణ త్రినాథ్ తెలిపారు.న నూతన కమిటీ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయ వాహిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు చర్యలు



కొత్తపల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుభాషిణి

కశింకోట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని పారిశుధ్య సిబ్బందిని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని కొత్తపల్లిని ఆమె సందర్శించారు. అక్కడ పారిశుధ్యం మెరుగు తీసుకుంటున్న చర్యలపై పంచాయతీ సిబ్బందితో చర్చించి పలు సూచనలిచ్చారు. పరిసరాల పరిశుభ్రత పాటించి పారిశుధ్యం మెరుగుపర్చడానికి సహకరించాలన్నారు. అనంతరం కొత్తపల్లిలో సంపద కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవఖండ భూముల్లో గృహాలు నిర్మిస్తే తీవ్రనష్టం

అనకాపల్లి: అనకాపల్లి జాతీయ రహదారి ఆవఖండ భూమిలో లేఅవుట్ నిర్మాణం చేసుకోవచ్చని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం విచిత్రంగా ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ భూములు చాలా మెత్తగా ఉండటంతో అక్కడ గృహాలు నిర్మించేందుకు వీలులేదని 15వ శతాబ్దంలో నిర్ధారణ చేశారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకూ ఈ భూముల్లో వ్యవసాయం, కూరగాయలు మాత్రమే రైతులు పండిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అక్కడ గృహాలు నిర్మించేందుకు అనుమతులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఆవఖండ భూముల్లో గృహాలు నిర్మించినట్లయితే అనకాపల్లిలో వర్షాలు పడే సమయంలో పట్టణానికి పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. భూకంపాలు వస్తే అక్కడ కట్టిన నిర్మాణాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. భూమిలో 4.5 అడుగులకే నీరు పడే అవకాశముందన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



బదిలీ అయిన ఉద్యోగులను సత్కరిస్తున్న నేతలు

మాడుగుల రూరల్ : మండలంలో సాగరం సచివాలయంలో పనిచేస్తూ బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను శనివారం ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ జయమ్మ తదితరులు సన్మానించారు. బదిలీపై ఈ సచివాలయానికి వచ్చిన వారిని కూడా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనాధు సూర్యకాంతం, జగ్గారావు, ఉప సర్పంచ్ దొడ్డి నారాయణ రావు, వార్డు సభ్యుడు పాము నాగరాజు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



కొల్లు మోహన్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణుడైన కొల్లు మోహన్ ఒంగోలులోని ఏపీ ఆర్‌జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా శనివారం మోహన్‌ను స్కూల్ యాజమాన్యం, హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై చిత్ర ప్రదర్శన



చలనచిత్రాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

కశింకోట: కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వ్యాన్‌పై చలనచిత్రాన్ని ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్.జె.వి.ప్రసాద్, బి.అప్పారావు, శ్రీనివాసరావు, మానస, రామారావు, పీడీలు వి.ప్రభాకరరావు, పి.కమల పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ఊంజల్ సేవ



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న ఆలయ ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా ఊంజల సేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు దంపతులచే ఆలయ అర్చకులు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు, విద్యార్థులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో అనకాపల్లి సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఎన్టీఆర్ స్టేడియం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ఇది సాగింది. ఈ సందర్భంగా వందేమాతరం.. వందే మాతరం అంటూ నినాదాలు చేశారు. పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులు దేశ సత్తాను ప్రపంచదేశాలకు చాటి చెప్పారన్నారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణ త్యాగాలు చేసిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, వివిధ కళాశాలల విద్యార్థులు, మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు.

కేవీ భవన నిర్మాణం ప్రారంభించండి

అనకాపల్లి టౌన్: కేంద్రీయ విద్యాలయ పాఠశాల భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి. ఫణీంద్రకుమార్ కోరారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ సీఎం రమేష్‌కు ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్యపేట పంచాయతీ అచ్చయ్యపేటలో 10 ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 2017లో అప్పటి ఎంపీ సత్యవతి ప్రతిపాదనలు పంపించగా.. 2022 సెప్టెంబర్ 25న ఆమెదం లభించిదన్నారు. నేటికీ విద్యాలయం పనులు ప్రారభం కాలేదన్నారు. తక్షణమే భవనం నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐవైఎఫ్ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు



అనుష్యను సత్కరిస్తున్న హెచ్‌ఎం సుధాకర్

అనకాపల్లి: మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామ కాలనీ జెడ్పీ హైస్కూల్ టెన్త్ టాపర్ మడక అనుష్య నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా శనివారం హైస్కూల్ ఆవరణలో అనుష్యను హెచ్‌ఎం ఎ.సుధాకర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ 2017లో కొత్తగా ప్రారంభించిన ఈ పాఠశాలలో తొలిసారిగా పదో తరగతిలో 555 మార్కులు సాధించి, ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపింది. కార్యక్రమంలో అక్కిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ సాలాపు శాంతి సూరి అప్పారావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వరద వెంకటకృష్ణ, ఉపాధ్యాయుడు ఎంబాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వరాదు



డిపో గేటువద్ద ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు

అనకాపల్లి: గవర్నర్‌పేట-2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు శనివారం డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో కార్యదర్శి కె.ఎస్.వి.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం వల్ల రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



కె.కోటపాడు ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య సిబ్బందితో లక్ష్మణ

కె.కోటపాడు : జిల్లాలో గల ఏరియా, సామాజిక ఆస్పత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించే చర్యలను తీసుకోవాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ అన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీ వద్ద పారిశుధ్య సిబ్బందితో కలిసి వేతనాలను మంజూరు చేయాలని శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ శానిటేషన్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వడంతో పాటు వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. అనంతరం సమస్యలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందించారు. పారిశుధ్య సిబ్బంది శ్రీను, లక్ష్మి, నాగరత్నం, రామారావు, పుష్ప పాల్గొన్నారు.

టీడీఆర్‌లకు వ్యతిరేకంగా పాదయాత్ర రేపు



మాట్లాడుతున్న రామసదాశివరావు

అచ్యుతాపురం: టీడీఆర్‌లను కట్టబెట్టే యత్నాలపై పోరాడేందుకు గానూ ఈ నెల 28న హరిపాలెం నుంచి కలెక్టరేట్ వరకూ పాదయాత్ర నిర్వహిస్తున్నామని నిర్వాసితుల సంఘం కో కన్వీనర్ కె.రామ సదాశివరావు తెలిపారు. శనివారం హరిపాలెంలో నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు, షాపులు కోల్పోతున్న వారికి పరిహారం ఇవ్వాలన్నారు. అంతేగానీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వీఎంఆర్‌డీఏ ద్వారా టీడీఆర్ బాండ్లు ఇచ్చి మోసం చేసే ప్రయత్నాలు తగదన్నారు. వీటి వల్ల మధ్యవర్తులకు, బిల్డర్లకు మేలు జరుగుతుందని, నిర్వాసితులకు కాదని తెలిపారు. 1200 మంది నిర్వాసితులకు రూ.400 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ టీడీఆర్‌లు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. తక్షణమే 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.రాము, కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, కూండ్రపు సోమునాయుడు, కన్నుంనాయుడు, బుద్ద రంగారావు, బాబూరావు, ఆడారి శ్రీనివాస్‌నాయుడు, బొడ్డేడ సూరి చంద్రరావు, కాండ్రేగుల నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.